# వేకువ వెలుగు

నందుల సుశీలాదేవి

గది తాళం తీసి లోపలకు అడుగుపెట్టింది విరజ.

శని, ఆదివారాలు ఉష సాధారణంగా వుళ్ళో వుండదు.

ఒంటరిగా వుండటంతో చిరాగ్గావుంది. మేట్నీకి వెళ్ళివచ్చింది.

ఆ సినిమా చూసేక తలనొప్పి మరింత ఎక్కువయింది.

అలసటగా మంచంమీద వాలిపోయింది. తెల్లవారితే ఉష వస్తుంది.

గలగలా కబుర్లుచెప్తూ పరిసరాలన్నింటినీ చైతన్యవంతం చేసేస్తుంది.

"ఉప్పాడ" వెడతానని చెప్పింది.

వస్తూ ఒకటో రెండో జరీ చీరలు కొనితెస్తుంది. ఆవిడలో జలపాతం!

కాకినాడలో ఒంటరిగా వుండేవాళ్ళకు సాయంత్రాలు గడపటం కష్టం.

సినిమా తప్పితే మరో వ్యాపారం వుండదు.

గుమ్మం దగ్గర చప్పుడయింది.

క్రింద వాటాలోని అరవ్వాళ్ళ అబ్బాయి "ఆంటీ" అంటూ వచ్చేడు.

వాడి చేతిలోని టెలిగ్రాం తీసుకొని అడిగింది. "ఇది ఎప్పుడు వచ్చింది బాబూ!"

"ఆఫ్టర్నూన్దా వచ్చింది" అంటూ పరుగెత్తుకొని పోయేడు.

క్షణం తటపటాయించింది.

మరుక్షణం టెలిగ్రాం చింపి చదివింది. క్రింద పెదవి దుఃఖంతో వణికింది.

చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది.

తరువాత చటుక్కున లేచింది.

రెండు చీరలు బేగ్లో పడేసుకొంది.

రూంమేట్ ఉషకు వో నాల్గువాక్యాలు వ్రాసి టేబిల్మీద పెట్టింది.

ఇంతలో పనిమనిషి వచ్చింది.

"కాఫీతేనా అమ్మా!" అంది.

విరజ టైము చూసుకొని అంది.

"వద్దులే సీతా! నేను అర్జెంటుగా వూరికి వెడుతున్నాను. ఈ సెలవు చీటీ మా ఆఫీసులో యిచ్చేయి. ఉషమ్మగారు రేపు వస్తారు."

గదికి తాళంపెట్టి 'కాంప్లెక్స్'కి వెళ్ళేసరికి రాజమండ్రి వెళ్ళే 'నాన్‌స్టాప్' బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

శారదా నర్సింగ్‌హోం ముందు రిక్షా దిగేసరికి చీకట్లు ముసురుకొంటున్నాయి.

తిన్నగా డాక్టరు గదిలోకి వెళ్ళింది.

డాక్టరుని విష్‌చేసి చేతిలో టెలిగ్రాం చూపించింది.

"ఓ మీరన్నమాట ఆ ముసలావిడ కూతురు. ఆవిడ యీ వయస్సులో వంట రి7 వుండటం ఏమిటి? హై బ్లడ్‌ప్రెషర్ వుంది. షుగర్ వుంది. మగతలోవున్న ఆవిడను పక్కింటివాళ్ళు యిక్కడ జాయిన్‌చేసి మీకు టెలిగ్రాం యిచ్చేరు. రండి చూద్దురుగాని."

విరజ డాక్టర్ శారదను అనుసరించింది.

తెల్లటి పక్కమీద పండిన తమలపాకులావున్న ఆ వృద్ధురాలిని చూస్తూ శారద అంది.

"ఈ రాత్రి గడవటం చాలా కష్టం. సిస్టర్స్ రాత్రంతా చూసుకొంటూనే వుంటారు. నేను మేడమీదనే వుంటాను ఏ రాత్రయినా రాగలను. ఈ ఆఖరి క్షణాలలో మీరు దగ్గర వుండటం ఒకటే ఆవిడకు సంతోషంగా వుంటుంది. ఏ క్షణమైనా కొంచెం తెలివి వచ్చినా రావచ్చును. లేదా యీ మగతలోనే ఆఖరి శ్వాస పీల్చవచ్చును. నిన్న సాయంత్రం నుండీ నా శక్తికొద్దీ వైద్యంచేస్తూనే వున్నాను. మీరు వచ్చేరు. నా బాధ్యత కొంత తగ్గింది."

విరజకి కంఠంలో వుండకట్టినట్లు అయింది.

మంచానికి చేరువగా కుర్చీ వేసుకొని కూర్చుంది.

ఆ వృద్ధురాలి చేతిని తన రెండు చేతుల్లోనూ తీసుకొంది.

నెమ్మదిగా ఆ చేతిని నిమరసాగింది.

గంటలు నెమ్మదిగా కరిగిపోతున్నాయి.

రాత్రి పదిగంటల ప్రాంతంలో మంచంమీద ఆవిడలో కొద్దిగా చలనం కనిపించింది.

విరజ ఆవిడ తలను తన వడిలోనికి తీసుకొని దగ్గరగా వంగింది.

ఆవిడ బలవంతాన కళ్ళు తెరవడానికి ప్రయత్నంచేసింది.

"చిట్టీ! వచ్చేవా?"

శుష్కించిని ఆవిడ మొహంలో లీలగా ఆనందం వెల్లివిరిసింది.

విరజ చేతిని గట్టిగా పట్టుకొని గుండెలమీదకు లాక్కుంది.

అంతలో మగత కమ్మేసింది.

కాలం నెమ్మదిగా దొర్లిపోతోంది.

మధ్యలో సిస్టర్ వచ్చి బీపి చూసి ఇంజక్షన్ చేసి వెళ్ళింది.

పదకొండు గంటల వేళ శారద రౌండ్సుకి వచ్చినప్పుడు విరజ ఆ వృద్ధు రాలికి సమీపంలో స్థిరంగా కూర్చొని, ఆ వృద్ధురాలి చేతిని సున్నితంగా పట్టుకొని నిమురుతూ కనపడింది.

శారద వచ్చి రోగిని పరీక్షించి అంది. "మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి. ఆవిడ కోమాలో వున్నారు. సిస్టర్ చూస్తూ వుంటుంది."

విరజ సున్నితంగా రోగి చేతిని నిమురుతూ అంది.

"పర్వాలేదు డాక్టర్! ఏ క్షణానయినా తెలివివావచ్చేమో! నేను ఇక్కడే వుంటాను."

విరజకి తల్లియెడల గల ప్రేమకు, శ్రద్ధకు శారద వో క్షణం చింతించింది.

పక్కింటివాళ్ళు చెప్పిన ప్రకారం వృద్ధురాలికీ, కూతురికీ అంతగా సయోధ్య లేదనీ, సంపన్నురాలైన తల్లి, వుద్యోగస్థురాలైన కూతురు ఎవరికి వారే వంటరిగా బ్రతుకుతున్నారనీ తెలిసింది.

కాని రక్తసంబంధం ఆఖరిక్షణాలలో వీరిద్దరినీ ఎంతగా కలిపింది– అనుకుంది.

డ్యూటీ సిస్టర్ ఆ రాత్రి ఏ వేళలో వచ్చిచూసినా విరజ స్థిరంగా అట్లాగే కూర్చునివుండటం చూసేది

తెలతెలవారుతుండే వో క్షణం ముసలావిడకు తెలివివచ్చింది.

మసకలు కమ్మిన కళ్ళతో విరజను చూసి "చి... ట్టి...." అంది అస్పష్టంగా. మరుక్షణం తల వాల్చేసింది.

విరజ ఆవిడ చేతిని నెమ్మదిగా పక్క మీద పెట్టిలేచింది.

సిస్టర్‌ని పిలిచింది.

ఆవిడవచ్చి తొందరగా వెళ్ళి శారదను పిలుచుకొని వచ్చింది.

శారదవచ్చి పరీక్షించి అంది.

"సారీ! నా ప్రయత్నం నేను చేసేను."

విరజ నిశ్శబ్దంగా నిలబడిపోయింది. మౌనంగా డాక్టర్ వెంట ఆవిడ గదిలోనికి వెళ్ళింది.

శారద అంది.

"మీరు రావటంవలన ఆఖరిక్షణాలలో ఆవిడకు శాంతిగా వుండి వుంటుంది. కన్నబిడ్డ చేతిలో ప్రాణాలు వదలాలనే ఏ తల్లి అయినా కోరుకొంటుంది."

విరజ మృదువుగా అంది.

"నేను ఆమె చిన్నబిడ్డను కాను."

శారద ఆశ్చర్యంగా ఏదో అనబోతూ వుండే, తిరిగి విరజ అంది.

"నిజమే డాక్టర్! నేను ఉషను కాను. ఆవిడ రూంమేట్ విరజను. నిన్న ఆదివారం కదా. సినిమాకి వెళ్ళి సాయంత్రం రూంకి రాగానే ఉషకు వచ్చిన టెలిగ్రాం చింపి చదివేను. ఉష తల్లి పరిస్థితి గంటల్లో వుందని తెలిసింది. ఉష యీ వుదయానికికాని రాదు. ఆదివారం గడిపి సోమవారం ప్రొద్దుటే వస్తుంది."

శారద విభ్రాంతినుండి తేరుకోలేదు.

"ఆవిడ ఎక్కడకు వెళ్ళేరు?"

విరజ నెమ్మదిగా అంది.

"ఉష సాధారణంగా వీకెండ్ తన బాయ్‌ఫ్రెండుతో గడిపి సోమవారం ఆఫీసుకి వస్తుంది. ఈ పాటికి నేను తనకి వ్రాసిన వుత్తరం చూసుకొని బయల్దేరే వుంటుంది...."

శారద విస్మయంగా అంది.

"అయితే.... అయితే.... రాత్రంతా ఒక్కక్షణం వదలకుండా ఆవిడ దగ్గర కూర్చొని ఆవిడను చేతుల్లోనే వుంచుకున్నారు."

విరజ కొంచెంసేపు నిశ్శబ్దంగా వుంది.

తరువాత నెమ్మదిగా అంది.

"ఆ మగతలో ఆవిడ నన్ను తన కూతురే అనుకొన్నారు. మృత్యుముఖంలో వున్న ఆవిడకు కన్నకూతురు దగ్గరే వుందన్న సంతృప్తిని నేనెందుకు పోగొట్టాలి? ఒక్కరోజు నిద్రలేకపోతే వచ్చిన నష్టం ఏముంది? ఉష తల్లికి ఆ సమయంలో నే వ్యగలిగిన సంతృప్తిముందు నా జీవితంలో నేనేమి ంతకం చే గొప్ప అనుభూతిని మరి పొందలేను."

కాసేపు ఆగి విరజ అంది తిరిగి.

"ఓ గంటకో అరగంటకో ఉష వచ్చేస్తుంది అవసానదశలో తల్లి దగ్గర లేకపోయానే అనే చింత ఆమెకి వుండదు ఓ స్నేహితుడితో హాయిగా గడపడానికి తను వెళ్ళినందువలన తల్లి పరిస్థితి తనకు తెలియకుండా పోయిందనే ఆత్మన్యూనతతో తనూ జీవితమంతా బాధపడాలి. ఇటు ఉషకీ, అటు ఉషతల్లికీ కూడా నేను యిట్లా రావటం ఓ రకమైన మనశ్శాంతినే కలుగజేశాయి ఓ రాత్రి నేను నిద్రపోక పోతే మాత్రం వచ్చే నష్టం ఏమిటి డాక్టర్?"

చాలా సామాన్యంగా చెప్పుకొని పోతున్న విరజ మాటలకు శారద రెండు కళ్ళూ నీటితో తళతళలాడేయి.

"విరజా! నేను వృత్తిరీత్యా డాక్టర్ని. ప్రమాదాలలో మరణించిన పసిపాపలను పోస్టుమార్టమ్ చేసినప్పుడు కూడా యింత చలించలేదు. ఏకైక సంతానాన్ని పోగొట్టుకొని విలపించే తల్లితండ్రులు నా వృత్తిలో తటస్థపడతారు. అప్పుడు కూడా నా మనస్సు యింత చలించలేదు. కుటుంబానికంతా ఆధారమైన వ్యక్తి దూరమయి విలపించే కుటుంబాలూ, పుడుతూనే తల్లిని పోగొట్టుకొనే శిశువులనూ తరచూ చూస్తూనే వుంటాము. కాని ఏ విషయంలో నన్ను నేను నిగ్రహించుకోవటానికి చాలా శక్తి కావాలసివస్తోంది. తోటి మనుష్యులపట్ల మానవత్వం యింతగా చూపించినవారు నాకు యింతవరకూ తటస్థపడలేదు. కొద్దిసేపట్లో ఉషగారు వచ్చుడు. తల్లి అంత్యక్రియలు ఆవిడ జరుపుతారు. కాని కాని విరజా! మిమ్మల్ని చూసి నేను గర్వపడుతున్నాను."

విరజ చేతిని శారద ప్రేమగా, గౌరవంగా నొక్కింది.

తూరుపు తెలతెలవారుతోంది.

---